# అతడు-ఆమె- న్యాయం

రైలు కదలటానికి సిద్ధంగా వుంది.

నేను ఆదార బాదరాగా వచ్చి ఆ కంపార్టు మెంటులోకి జొరబడ్డాను. నాకు ఈ పరుగు ప్రయాణాలు, నిలబడి వ్రేలాడుతూ ప్రయాణం చెయ్యడం సర్వ సామాన్యం. నా వుద్యోగం అలాంటిది, అనుకోకుండా, ఆకస్మాత్తుగా వెళ్ళాల్సి వుంటుంది. తప్పదు మరి-రెక్కలమ్ముకున్నవాణ్ణి. అంచేత సీటు దొరక్కపోయినా, వ్రేలాడుతూ పోవాల్సి వచ్చినా బాధపడను. కాని సీటు లభిస్తే మాత్రం ఆశ్చర్యపోతాను. అదృష్టం మారుతోందని కాస్సేపు మురిసిపోతాను. అందువల్లే, ఆ రోజు కంపార్టుమెంటులోకి ఎక్కి చాలా ఆశ్చర్యపోయాను. ఎందువల్ల నంటే దాదాపు కంపార్టుమెంటంతా ఖాళీగా వుండటమే, అలాగని సరిపెట్టుకొని, కూర్చోక, కిటికీ ప్రక్క సీటుకై వెతికాను వున్నదాంతో తృప్తిపడలేని సహజ మానవ నైజం వల్ల. కాని అక్కడ అదృష్టం పన్చెయ్యలేదు. అప్పటికే ఆ కిటికీ ప్రక్క సీట్లన్నీ ఆక్రమించ బడ్డాయ్. అంచేత పరిస్థితిలో రాజీ పడి ఖాళీగా వున్న పొడుగాటి బల్లపై కూర్చున్నాను. అలా కూర్చున్న వెంటనే నా దృష్టి నాకర్షించింది ఆవ్యక్తి.

అతడెందుకు నా దృష్టిని ఆకర్షించాడు? అతడిలో గల ప్రత్యేకతేకమిటని నన్ను నేనే ప్రశ్నించుకోవటం వల్ల నిశితంగా, పరిశీలనగా చూశాను.

అతడు ఎర్రగా నవనవలాడుతూ లేడు. నల్లగా, ఎండ, వాననీ కొన్ని సంవత్సరాలుగా అనుభవిస్తున్న గడకర్రలా వున్నాడు. వుంగరాల జుట్టుకాని, అందమైన క్రాఫింగు కానీ లేవు. కడ్డీజుట్టుని మెడదాకా పెంచాడు. గడ్డం కూడా- దాని వునికిని మరచిపోవడం వల్ల ఏపుగా పెరిగింది. అతడు ధరించిన లాల్చీ పైజమాలు మాసిపోయి అసహ్యంగా వున్నాయ్. చేతికున్న పొడవాటి గుడ్డ సంచీని మడిచి, ఒళ్ళో పెట్టుకున్నాడు. దాన్లోంచి ఏదో తినే పదార్థాన్ని మాటిమాటికి తీసి నోట్లోకి సరఫరా చేస్తున్నాడు. అతడు నవులుతున్న దవడలు చెవులు తమాషాగా కదుల్తున్నాయ్.

ఇంతటి సాధారణమైన వ్యక్తి ఎందువల్ల నా దృష్టిని ఆకర్షించాడాని ఒక్క క్షణం ఆలోచించేను - అప్పుడు నాకర్థమైంది - కళ్ళు! -అతడి కళ్ళు-

గాండ్రించి మీద కురికే పులి కళ్ళులా, శ్రీరాముణ్ణి నిలేసిన పరుశురాముడి కళ్ళులా ఎర్రగా కణకణలాడుతున్నాయి.

నేను నా పెట్టెని పైన వుంచి సర్దుకుని కూర్చున్నాను.

అంతలో రైలు కూత వేసి బయలుదేరింది. అదేమిటో అప్పటివరకు ఖాళీగా వున్న పెట్టెలోకి బిలబిలమంటూ జనం ఎక్కారు. వీళ్ళందరూ ఇప్పటి వరకు ఎక్కడ వున్నారాని ఆశ్చర్యపడ్డాను. రైలు మెల్లి మెల్లిగా వేగాన్ని పుంజుకుంటోంది. ఎక్కిన జనం మెల్లి మెల్లిగా లోనికొచ్చి ఖాళీగా వున్న సీట్లలో సర్దుకుంటున్నారు. అలా కూర్చోవటంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి నా ప్రక్కగా కూర్చున్నారు. వాళ్ళ వేషధారణ. తెలుగు ఇంగ్లీషు కలిపి కొడుతున్న తీరు చూసి ఉద్యోగస్థులనిపించింది. వాళ్ళు ముగ్గురూ తమ తమ సామాన్లని అక్కడక్కడ సర్దేసి నిశ్చింతగా తీరుబడిగా కూర్చున్నారు.

“రిజర్వేషన్ లేకుండా ప్రయాణం చెయ్యాలంటే నాకు మహా చిరాకు. బ హేటిట్?” అన్నాడో వ్యక్తి.

“అవునవును” అన్నాడు ప్రక్కనున్న అతను కడుభక్తి ప్రవృత్తులతో.

“అయినా ఇలా చెప్పా పెట్టకుండా, అకస్మాత్తుగా చెకింగ్‌కి పొమ్మంటే ఎలా? కనీసం ఒక్కరోజు ముందుగా చెప్పాలన్న ప్రాథమిక జ్ఞానం కూడా లేదు,” అన్నాడా వ్యక్తి మళ్ళీ.

“అవునవును” అన్నాడు ప్రక్కవున్న బంటు. మూడో వ్యక్తి ఇదేం పట్టించుకోనట్లు, చాలా దీర్ఘంగా చేతిలో వున్న పుస్తకాన్ని చదివేస్తున్నాడు.

ఇంకా నయం. సీటు దొరికింది. లేకుంటే నాలుగు గంటలు నిలబడలేక చచ్చేవాళ్ళం!” అంటూ చేతిలో వున్న లెదర్ బ్యాగ్‌లోంచి సిగరెట్ పెట్టే, అగ్గిపెట్టె తీసి, ఒక సిగరెట్ తను ముట్టించి, పుస్తకం చదువుతున్న వ్యక్తిని వుద్దేశించి “సిగరెట్ కావాలా శివప్పా?” అన్నాడు.

అతగాడు పుస్తకంలోంచి తలెత్తితే రస భంగం అవుతుందని కాబోలు, చదువుతూనే వాటినందుకున్నాడు.

వాళ్ళాపనుల్లో వుండగా, నేను నా పనుల్లో వున్నాను. అతని చేతిలో నున్న లెదర్ బ్యాగ్‌పై నున్న పేరు చదివాను– రాఘవులు. దాన్నిబట్టి వాళ్ళ పేర్లు రాఘవుల,శివప్పని, ఆమూడో 'అవునవును' వ్యక్తి వాళ్ళ గుమాస్తాగాడని, వాళ్ళు ఆఫీసు పనిమీద వెళుతున్నారని నేను గ్రహించగలిగాను.

నా ముందు కూర్చున్న గడ్డం వ్యక్తి, ఇవేవి పట్టించుకోనట్లు అసలు తానొక్కడే ఆ పెట్టెలో వున్నట్లు బయటికి చూస్తూ కూర్చున్నాడు.

రైలు లయబద్ధంగా తాళం వేస్తూ పరుగెడుతోంది.

నా ప్రక్కన కూర్చున్న వ్యక్తి సిగరెట్ పీలుస్తూ, తెలుగు పేపరు చదవటంలో నిమగ్నుడయినాడు. అతడి ప్రక్కనున్న 'అవునవును' గుమాస్తా, చాలా శ్రద్ధాసక్తులతో అతడి వంక, నోటి వంక చూస్తున్నాడు.

అప్పుడే ఆమెని మొదటిసారిగా చూసేను. తలుపు ప్రక్కగా, వొదిగి, మరుగుదొడ్డి ప్రక్కగా నిల్చుంది. ముప్ఫై ఏళ్ళ వయస్సు. కష్టాల కొలిమిలో కాలటం వల్ల ఎరుపెక్కినట్లు మొహం, కప్పు ముక్కు, వెలుగును మర్చిపోయిన కళ్ళు. శరీరంలో రక్తం లేమి వల్ల తెల్లబడ్డ పెదాలు, పోషణలేక జంకుతున్న అవయవపు పొంకంతో బాధలకి, కష్టాలకి సజీవ ప్రతిరూపంలా వుంది. మెళ్ళో మట్టి కొట్టుకుపోయిన పసుపు తాడు, చేతికి మట్టి గాజులు, ఆ చెయ్యి పొదివి పట్టుకున్న పదేళ్ళ కుర్రాడు. మరో చేతిలో చిన్న గుడ్డ సంచి, భయంగా నిలబడుంది. ఆమె చేతిని పట్టుకున్న కుర్రాడు, తల్లి నానుకుని రైలు కుదుపులకి నిద్రపోతున్నాడు.

అంతలో రాఘవులు 'శివప్పా! ఇది చూసేవా? ఫలానా వూళ్ళో ఇంజనీరుని ఎసిబి వాళ్ళు ట్రాప్ చేసారట" అన్నాడు.

శివప్ప ఏమీ మాట్లాడలేదు.

"అసలయినా – నేరం లంచం తీసుకున్న ఒక్కడిదేనా? ఇచ్చిన వాడిది నేరం కాదా? ఇస్తేనే కదా తీసుకుంటారు? గుడ్డి న్యాయం." అన్నాడతను మళ్ళీ.

"అవునవును" అన్నాడు గుమాస్తా.

"లంచాలు తీసుకోక ఛస్తారా? చాలీ చాలని జీతాలు– ఆకాశాన్నంటుతున్న ధరలు– వాళ్ళూ బ్రతకాలిగా!" అన్నాడు ఏదో సమర్థింపుగా 'అవునవును'.

ఆ గడ్డం వ్యక్తి మొదటిసారిగా తల త్రిప్పి వాళ్ళ వైపు ఒక్కక్షణం చూసేడు. తర్వాత మళ్ళీ తల తిప్పేసుకున్నాడు.

ఆ యువతి అలాగే ఏమాత్రం కదలిక లేకుండా నుల్చునుంది.

శివప్ప పుస్తకంలోంచి తలెత్తి "చాలా బావుందోయ్– వెరీ హాట్ గుడ్ బుక్!" అన్నాడు అనందాన్ని ఆస్వాదించినట్లు

రాఘవులు అతడి మాటని వినిపించుకోనట్లు "ఇంతకీ మనం అక్కడున్న వారం రోజులు ఏర్పాట్లు జరుగుతాయా? లేక బికారి వెధవల్లా తిరగాలా?" అన్నాడు.

శివప్ప సాలోచనగా "చేస్తారు లేకపోతే అడ్డంగా రాసి పారేద్దాం– పీక్కు పీక్కు ఛస్తారు" అన్నాడు.

'అవునవును?" గుమాస్తా పలికాడు.

ఇంతలో ఎవరో మరుగుదొడ్డి కెళ్ళటం వల్ల ఆ యువతి జరిగి కాస్తముందుకొచ్చింది. శివప్ప, రాఘవులు ఆమెను చూసేరు. వేడి పుస్తకం చదివిన శివప్ప ఆమె వైపు వాడిగా, పదునుగా చూసేడు. తర్వాత రాఘవులు చెవిలో ఏదో చెప్పాడు. ఇద్దరూ అర్ధవంతంగా, చిలిపిగా నవ్వుకున్నారు. విషయం తెలీని గుమాస్తా "అవునవును" అనబోయి తమాయించుకున్నాడు.

శివప్ప విషయాన్ని కొలుస్తున్నట్లు 'అవును. రాఘవులూ– మొన్న ఆ పని పూర్తయిందా? ఏవన్నా గిట్టుబాటయిందా?" అనడిగాడు.

రాఘవులు 'ఉహుం! అనుకున్నంతగా గిట్టుబాటు కాలేదు" అన్నాడు నిర్లిప్తంగా.

"సరేలే! చచ్చినవాడి పెళ్ళికి వచ్చిందే కట్నంట".

అంతలో చిన్న స్టేషనులో రైలాగింది.

గడ్డం వ్యక్తి తినటం పూర్తి చేసి, 'బ్రేవ్' మని త్రేన్చి, మంచి నీళ్ళు త్రాగటానికి కాబోలు లోనికెళ్ళాడు.

అతడటు వెళ్ళగానే రాఘవులు 'వేడెవడు? జైల్లోంచి తప్పించుకున్న వాడిలా– వెధవ గడ్డం వీడూనూ," అన్నాడు.

"అవునవును!"

"వాడి ముందు మన విషయాలు మాట్లాడక– రోజులేం బాగా లేవు." హెచ్చరించాడు శివప్ప.

వాళ్ళు కేవలం అతడి గురించే భయపడటం, నేనక్కడే వున్నా పట్టించుకోక పోవటం నాకు ఆశ్చర్యం కలిగించాయ్.

అంతలో ఆ గడ్డంవాడు తిరిగొచ్చాడు. వస్తూ వస్తూ తలుపు ప్రక్కన భయం భయంగా నిలుచున్న యువతినీ, ఆమె చేతిని పట్టుకుని నిద్రపోతున్న పిల్లవాడిని చూసేడు. అలా ఒక్క క్షణం చూసేక, ఆమెతో "ఇలా రామ్మా! వచ్చి కూర్చో" అన్నాడు తన సీటు వైపు చూపిస్తూ.

ఆమె భయంగా "వద్దులే బాబూ! ఇలా నిలబడతాను," అంది.

"ఫర్వాలేదు పిల్లవాడితో ఎంత సేపని అలా నిలబడతావ్– రా వచ్చి కూర్చో–" అన్నాడు.

ఆమె ఇక తప్పదన్నట్లు మెల్లగా వచ్చి అతడి సీటులో కూర్చుంది. పిల్లాడిని ఒళ్ళో పడుకోపెట్టుకుంది.

ఆ గడ్డం వ్యక్తి చివరగా కూర్చున్న నా ప్రక్కగా చూసి "సర్దుకోండి" అంటూ ఆదేశించాడు.

శివప్ప, రాఘవులు ఏదో అనబోయి, అతడి వాలకానికి భయపడి, సర్దుకుని చోటిచ్చారు.

రైలు తిరిగి బయలుదేరింది.

ఆమె కళ్ళ ముందు కదిలిపోతున్న పచ్చటి పొలాన్ని చూస్తోంది.

ఆ గడ్డం వ్యక్తి ఆమెని ఒక క్షణం పరిశీలనగా చూసి "ఏ వూరు వెడుతున్నావమ్మా?" అనడిగాడు.

ఇంత వరకు గుడ్లప్పగించి ఆమెను చూస్తున్న శివప్ప, రాఘవులు, అతడి చొరవకి కళ్ళతోనే ఆనందాన్ని ప్రకటించారు.

ఆమె తల త్రిప్పి అతడిని చూసింది "విజయవాడ"

"ఏమిటి పని?" మళ్ళీ ప్రశ్నించాడు.

ఆమె ఒక్క క్షణం మౌనము తర్వాత, తనలో తాను మాట్లాడుకుంటున్నట్లుగా "నా పెనిమిటి హాస్పటల్లో వున్నాడు, చూడటానికి." అంది.

"ఏమిటి జబ్బు?"

"ఏమని చెప్పను. అది అందరికి రావలసినది కాదు. బాగా వున్న వాళ్ళకి, డబ్బు, తీరుబడి వున్నోళ్ళకి రావలసిన జబ్బు– కేన్సరు?" అంది నిర్లిప్తంగా.

"అయ్యో పాపం!" అన్నాడు ఆ గడ్డం వ్యక్తి.

శివప్ప రాఘవులు చెవిలో "గురుడు సీటిచ్చి లైన్లో పెడుతున్నాడు చూసేవా?" అన్నాడు. రాఘవులు నవ్వేడు.

"అవునవ్వును!" అంటూ ఏకీ భవించాడు గుమాస్తా యాధావిధిగా.

ఆమె మళ్ళీ కిటికీలోంచి బయటికి చూస్తోంది. చల్లగాలి రివ్వున వీస్తూండటం వల్ల, ఆమె తన కొంగుని పిల్లవాడికి

కప్పింది.

గడ్డం వ్యక్తి మళ్ళీ అడిగాడు "ఇలా రోజూ వెళ్ళొస్తుంటావా?"

"లేదు- నేను వెళ్ళి పదిహేను రోజులయింది. నేను ఒక ఫ్యాక్టరీలో పని చేస్తాను. ఆ ఫ్యాక్టరీ పదిహేను దినాల నుంచి సమ్మెలో వుంది. జీతాలు లేవు. సమ్మె ఆపుతే జీతం పుచ్చుకుని వెళ్ళి ఆడిని చూసొద్దాముకున్నాను. కాని సమ్మె పూర్తికాలేదు. ఇక వుండబట్టలేక పిల్లలిద్దర్నీ ఇంట్లో వదిలి, యిలా బయలుదేరాను." అంది. అంటున్నప్పుడు ఆమె గొంతులో బాధ, కళ్ళలో చెమ్మ.

ఆ గడ్డం వ్యక్తి ఏమీ మాట్లాడలేదు.

ఆమె మళ్ళీ "వెళ్ళి పదిహేను రోజులయింది. ఎలా వున్నాడో? అసలు ఉన్నాడో.?

అటు తర్వాత వూహించ లేనట్లుగా ఆపేసింది. కొంగుతో కళ్లు తుడుచుకుంది.

గడ్డం వ్యక్తి దీర్ఘాలోచనలో పడ్డాడు.

రాఘవులు ఏదో ఒకటి ఆమెకి సంబంధించినది మాట్లాడి తనూ ఆమె కనుసన్నలో పడాలన్న వుద్దేశ్యంతో "మొన్న మా మేనమామ పెళ్ళాం కేన్సరువల్లే చచ్చింది" అన్నాడు.

"అవునవును" అన్నాడు గుమాస్తా.

ఆమె భయంగా రాఘవులి వంక చూసింది. ఆ గడ్డం వ్యక్తి మింగేసేలా చూసేడు. రాఘవులు గతుక్కుమని పేపరులో మొహందాచేడు.

రైలు పెద్ద శబ్దం చేసుకుంటూ బ్రిడ్జీగుండా పోతోంది.

అంతలో ఆ యువతి కంగారుగా, అసహనంగా సీటులో కదలడం అందరూ గమనించారు. గడ్డం వ్యక్తి కూడా ఆమెలోని మార్పు గమనించి, "ఏమైందమ్మా?" అనడిగాడు.

ఆమె ముందు ఏమీ మాట్లాడక, ఆ వైపుగా చూసింది గడ్డం వ్యక్తి తల త్రిప్పి అటువైపు చూసేడు. టికెట్టు కలెక్టర్ తెల్లటి దుస్తుల్లో శాంతి దూతలా వస్తున్నాడు.

రాఘవులు "టికెట్టు లేనట్లుంది అమ్మడు కంగారు పడుతోంది" అన్నాడు.

రహస్యంగా శివప్ప"టికెట్టు కొనిపెడితే మనకేవన్నా ఉపయోగముంటుందా?" అంటున్నాడు హాట్‌బుక్ గుర్తుకొచ్చి.

"అడుగుదామంటే వీడొకడు వెధవ గడ్డం వీడూనూ" అన్నాడు రాఘవులు. వాళ్ళు రహస్యంగా మాట్లాడుకుంటున్నా, అతుక్కుని కూర్చోటం వల్ల కాబోలు నాకు స్పష్టంగా వినిపిస్తున్నాయ్. ఆమె కంగారుని కనిపెట్టిన ఆ వ్యక్తి-

"ఏమ్మా! టికెట్టు కొనుక్కోలేదా?" అనడిగాడు. ఆమె లేదన్నట్లుగా తలూపింది.

"పర్వాలేదు లేమ్మా కంగారు పడకు, టిక్కెట్టు లేకుండా ప్రయాణం చెయ్యడం పెద్దనేరమేమీ కాదు" అన్నాడు

అందరూ ఆశ్చర్యంగా అతడి వైపు చూసేరు. అలా అందరూ ఒక్కసారి తన వైపు చూసేసరికి, సమర్థింపుగా "అవును ఏది తప్పు"

ఏదినేరం, నీ వల్ల ఇంకో మనిషి, సాటివాడు నష్టపోతే అది నేరం. అదే తప్పు.అంతే! లంచగొండి తనం, బ్లాక్ మార్కెట్టు వీటన్నిటితో పోలిస్తే టికెట్టు లేని ప్రయాణం ఏ మాత్రం నేరం?"

అతడలా మాట్లాడుతున్నా ఆమెలో భయం తాలూకు ఛాయలు పోలేదు. టికెట్టు కలెక్టర్ రానే వచ్చాడు, నేనూ రాఘవులు, శివప్ప, గుమాస్తా టిక్కెట్లు చూపాం, ఆమె నడిగాడు. ఆమె తలొంచుకుంది. అర్థంకాక గడ్డం వ్యక్తినడిగాడు.

"టిక్కెట్టు లేదు" అన్నాడు.

“ఏమిటీ? టిక్కెట్టు లేదా?”

“అవును టిక్కెట్టు లేదు, కానీ డబ్బులు లేకకాదు.”

“మరి?”

“నే టిక్కెట్టిమ్మని వంద రూపాయల కాగితమిచ్చాను. కుర్రనాయాలు క్రికెట్ కామెంటరీ వింటూ,చిల్లర లేదు తెమ్మన్నాడు. అలాగేనన్చెప్పి వచ్చి బండిలో కూర్చున్నాను”

ఆ టికెట్టు కలెక్టర్ ఇవేం వినిపించుకోనట్లు మళ్ళీ ఆమెనడిగాడు. “నీ టిక్కెట్టెక్కడా? పిల్లాడికి కూడా కొన్నావా?”

“టిక్కెట్టు లేదండీ.ఈ ఒక్క సారికి....” ఏదో చెప్పబోయింది.

“లే లే టిక్కెట్టు లేకుండా వచ్చి సీటులో కూడా కూర్చున్నావ్. పద పద ప్రక్క స్టేషన్లో దిగుదువు గాని” అంటూ కసిరాడు.

రాఘవులు కల్పించుకుంటూ “ఆమె భర్త ఆస్పత్రిలో వున్నాట్ట చూడటానికి వెడుతోంది. పోనిలేండి పాపం” ఆమెపై జాలికన్నా ఆమెని దించి వేస్తాడేమోనన్న బెంగ ఎక్కువగా వుంది అతడి మాటలో.

“ఇవన్నీ మామూలే సార్. అనేకం చూస్తుంటాం అనేక కథలు వింటుంటాం. వీళ్ళ సంగతి మీకు తెలీదు. పద– ఇంకా కూర్చున్నావ్” అంటూ గదమాయించాడు.

అంతలో ఆ గడ్డం వ్యక్తి చువ్వలా లేచాడు. లాల్చీ జేబులోంచి వంద రూపాయల కాగితాన్ని తీసి, అతడికందిస్తూ “నా టిక్కెట్టు, ఆమెదీ, పిల్లాడిది మూడు వ్రాసుకో” అన్నాడు.

అందరూ అతనివంక శ్లాఘనీయంగా చూసేరు. టిక్కెట్టు కలెక్టర్ కాస్త తగ్గేడు. బిల్లు బుక్ బయటకు తీస్తూ, “నా దగ్గర చిల్లర లేనట్లుంది” అని గొణిగాడు.

వెంటనే రాఘవులు “చిల్లర నేనిస్తా” నంటూ చేతిలోని తోలుసంచీ సర్రుని తెరిచి, దాంట్లోంచి లావుగా వున్న పర్సు బయటకు తీసి చిల్లర లెక్కపెట్టి ఇచ్చాడు.

టిక్కెట్టు కలెక్టర్ అతడందించిన చిల్లర పుచ్చుకుని తనకి రావాల్సిన మొత్తం తీసుకుని, మిగతా డబ్బు, రశీదు గడ్డం వ్యక్తికిచ్చాడు.

అతడు వాటిని తన గుప్పెటలో ఇముడ్చుకుంటూ వెడుతూన్న టిక్కెట్టు కలెక్టర్‌తో “నీ క్యాబిన్‌లో వున్న చుట్ట ఆసామికి, ఎర్ర పిన్ని గారికీ టిక్కెట్లున్నాయా ఫ్రెండూ” అనడిగాడు.

అతడు కంగారుగా విననట్లు వెళ్ళిపోయాడు. గడ్డం వ్యక్తి లేచి కిటికీలోంచి తుపుక్కున వుమ్మేసాడు. ఆమె కృతజ్ఞతగా అతడి వంక చూసింది కాని అతనేదో ఆలోచనల్లో వున్నాడు.

రైలు వేగం తగ్గించి స్టేషన్ సమీపిస్తున్నట్లు కూత పెట్టింది.ఆ గడ్డం వ్యక్తి తన చేతిలో వున్న టిక్కెట్ రసీదు, మిగిలిన డబ్బులూ ఆమెకివ్వబోయాడు.

“పర్వాలేదు వుంచుకోమ్మా దారి ఖర్చులకీ, మందులకి, పని కొస్తాయ్” అంటూ బలవంతాన ఆమె చేతిలో వుంచాడు.

రాఘవులు, శివప్ప అతడి చనువుకి అసూయ పడ్డారు. రైలు ఆగింది.

జనం బిల బిలమంటూ ఎక్కేరు. ఒక్కసారిగా కంపార్టు మెంటులో త్రొక్కిసలాట నేను వచ్చే స్టేషన్లో దిగాలి. పావుగంట ప్రయాణం. అంచేత లేచి నా పెట్టి క్రిందకు దింపడాన్కి తయారుగా వుంచుకున్నాను. నేను మళ్ళీ సర్దుక్కూర్చొనే సరికి ఆ గడ్డం వ్యక్తి అక్కడ లేడు. ఏడి, ఏమయ్యాడు, దిగిపోయాడా? అనుకుంటుండగానే రాఘవులు గొల్లుమన్నాడు.

“శివప్పా! నా బ్యాగేది? ఇప్పుడేగా ఇక్కడుంచాను. ఏవైంది?” కంగారుగా బండి అంతా ప్రాకుకుంటూ చూస్తున్నాడు.

శివప్ప కంగారుగా “ఎంతుంది అందులో” అనడుగుతున్నాడు.

"అయ్యో అంతా అందులోనే వుందిరా."

"అవునవును" అన్నాడు గుమాస్తా విచారంగా.

"ఛ! నోర్మూయ్" కసిరాడు శివప్ప.

నాకు నవ్వాగింది కాదు.రైలు కదిలింది.